అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం : జెసి

కడప : ప్రతి సోమవారంతో పాటు మండల స్థాయిలో నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం', 'స్పందన' కార్యక్రమంలో అర్జీదారులకు నాణ్యమైన సత్వర పరిష్కారం చూపాలని జెసి గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. జెసితోపాటు డిఆర్ఒ గంగాధర్ గౌడ్, ఎస్‌డిసి రామ్మోహన్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డిఆర్‌డిఎ, డ్వామా పిడీలు ఆనంద్ నాయక్, యదు భూషన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి శ్రీలక్ష్మి లు, హౌజింగ్ పిడి కృష్ణయ్య ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఫిర్యాదులకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదా రుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచిస్తూ.. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమ ంలో సిపివో వెంకట రావు, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఇ వీరన్న, జిల్లా వ్యవసాయ అధికారి జెసి నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్ఇ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిస్సహాయ స్థితిలో పోలీస్!



సిఐపై దాడుల సూత్రధారులపై చర్యలేవీ

నిజాయితీకి అవమానాలే బహుమానాలు

రాజకీయం చేతిలో అస్త్ర సన్యాసం

జిల్లాలో పోలీస్ యంత్రాంగం నిస్సహాయ స్థితిలో జారుకుంది. సామాన్యులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడే రోజులను చూశాం. కానీ రాజకీయ అండదండలు కలిగిన వారికి పోలీసులు అన్నా, పోలీస్‌స్టేషన్ అన్నా లెక్కాజమా లేకుండా పోయిన ఘటనలు తరుచుగా చోటుచేసుకోవడం పరిపాటిగా మారింది. శనివారం రాత్రి కడప నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీలోని మయూర దుకాణం దగ్గర చేరిన ఉత్తరాదికి చెందిన అల్లరి బ్యాచ్‌ను వారించిన ఇంటెలి జెలెన్స్ సిఐ అనిల్‌కుమార్‌పై దాడికి తెగబడిన ఘటన చర్చనీయాంశంగా మారింది.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో పోలీస్ విధి నిర్వహణ కత్తిమీద సాములా తయారైంది. నిత్యం అసాంఘిక శక్తులను తలపడాల్సిన ఉద్యోగ బాధ్యత వారిది. అసాంఘిక శక్తులను అదుపులో పెట్టి సమాజానికి శాంతి భద్రతలు అందించడమే వారి కర్తవ్యం. ఇటువంటి విధుల నిర్వహణలో అసాంఘిక శక్తుల, పోలీసుల మధ్య వైరుధ్యం కొనసాగుతుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో భాగంగానే కడప నగరం లోని కో-ఆపరేటివ్ కాలనీలో నివాసం ఉంటున్న అన్నమయ్య జిల్లా రాయచోటి ఇంటెలిజెన్స్ సిఐ అనిల్‌కుమార్ మయూర గార్డెనియాలో పని చేస్తున్న ఉత్తరాదికి చెందిన పలువురు సమీపంలోని పాన్ షాప్ దగ్గర అల్లరి చేస్తుండగా వారించిన ఘటనలో పరస్పర దాడుల నేపథ్యంలో సిఐ గాయాల పాలు కావడం, ఉత్తరాది వారు గాయాల బారిన పడకపోవడం సందేహాలకు తావిస్తోంది. దీని వెనుక అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అండదండలు కలిగిన వారు ఉన్నారనే వాదనకు బలం చేకూరుతోంది. ఇదిలాగా ఉండగా పోలీసు విచారణలో ఇంటిలిజెన్స్ సిఐ దురుసు ప్రవర్తన కారణంగా ఉత్తరాదికి చెందిన వారు దాడి చేశారని వివరించడం సందేహాలకు తావిస్తోంది.

రాజీ మంతనాలు?

సిఐపై దాడి చేసి రెండ్రోజులు గడుస్తోంది. పోలీసులు కొంత మంది మూకను అదుపులోకి తీసుకుని దాడులకు పాల్పడిన సూత్ర దారులను అదుపులోకి తీసుకోవడం లేదు. పైగా దాడులకు పాల్పడిన వారిలో ఎస్సి, ఎస్‌టీలు ఉన్నారని, వాళ్ల కేసు పెడితే మీపైన కేసు నమోదు చేయాల్సి వస్తుందని రాజీ యత్నాలకు తెరతీసినట్లు సమాచారం. దీని వెనుక రాజకీయ అండదండలు కలిగిన హోటల్ యాజమాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగిన కారణంగా పోలీసులు అస్త్ర సన్యాసం చేసినట్లు తెలుస్తోంది. పైగా తన డిపార్ట్‌మెంట్ చెందిన అధికారిని దోషిగా చూపుతున్నామని, ఉత్తరాది చెందిన యువకులపై కేసు నమోదు చేసి ఉంటే పోలీసులపైనే అనుమానాలు, విమర్శలు వచ్చే వని, పూర్తి పారదర్శకంగా వ్యవహరించామని కితాబు ఇవ్వుకోవడం గమనార్హం. ఇటీవల చింతకొమ్మదిన్నె ఎస్ఐ గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకున్న పాపానికి దాడికి గురైనట్లు తెలుస్తోంది. ఇదే తరహాలో ప్రొద్దుటూరులో ఓ మహిళా ఎస్ఐ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న పాపానికి రాళ్ల దాడి పాలు కావడం గమనించాల్సి ఉంది.

రాజకీయం చేతిలో సమిధలుగా...

జిల్లాలో ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమార్కులు హద్దుపద్దూ లేకుండాపోతోంది. ఇటీవల కాలంలో పోలీసులపైనే అక్రమార్కులు దాడులకు తెగబడుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఇందులో నిజాయతీ కలిగిన అధికారులే సమిధలుగా మారుతుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న పలు ఘటనల విషయంలో పోలీస్ యంత్రాంగం ఎటువంటి చర్యలు తీసుకోలేని నిస్సహాయ స్థితిలోకి జారుకుంది. ఇందులో భాగంగా తాజాగా ఇంటెలిజెన్స్ సిఐ అనిల్‌కుమార్ ఘటన ఉదాహరణ. ఇదేతరహాలో ప్రొద్దుటూరుకు చెందిన మహిళా ఎస్ఐ, చింతకొమ్మదిన్నెకు చెందిన ఎస్ఐ బాధితులు మారడం విస్మయాన్ని కలిగిస్తోంది. కడప నగరం నడిబొడ్డున ఇంటెలిజెన్స్ సిఐ అనిల్‌కుమార్‌పై దాడి చేసి గాయపరిచిన నేపథ్యంలో సకాలంలో కేసు తీసుకోవడానికి కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తోంది.

నిష్పక్షపాతంగా వ్యవహరించాం

ఇంటెలిజెన్స్ సిఐ అనిల్‌కుమార్ ఘర్షణ కేసులో సొంత డిపార్ట్ మెంట్ అధికారి, ఉత్తరాది యువకులనే బేధం లేకుండా వ్యవహరించాం. సకాలంలో కేసులు తీసుకుని నమోదు చేశాం.

-కడప డిఎస్పీ మహ్మద్ షరీఫ్.

'ఆడుదాం ఆంధ్ర' ఏర్పాట్లు వేగవంతం : జెసి

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమ ఏర్పాట్లను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాలులో 'అడుదాం ఆంధ్ర' క్రీడల నిర్వహణ, హౌసింగ్, గడప గడపకు మన ప్రభుత్వం, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రోగ్రెస్, ఎపి మీసేవ సర్వీసెస్, ఆధార్ సీడింగ్ తదితర అంశాలపె . కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్‌తో కలిసి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో త్వరలో నిర్వహిస్తున్న 'అడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే క్రీడలను నిర్వహించేందుకు సంబంధిత అధికారుల ద్వారా చేపట్టిన క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలన్నారు. క్రీడా పోటీలను వీక్షించేందుకు వచ్చే వారి పేర్లను కుడా జాబితా తయారు చేయాలని చెప్పారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న హౌసింగ్ లే అవుట్లలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను నిర్ధేశిత గడువు లోపు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రయారిటీ బిల్డింగుల నిర్మాణాలకు సంబంధించి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల పరిధిలో జరుగుతున్న పనులను లక్ష్యం మేరకు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎంఎస్ఒలు, సిహెచ్ఒలను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండల స్థాయిలో సంతృప్త స్థాయిలో నిర్వహించాలని, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులకు వెంటనే పరిష్కార మార్గాలను చూపాలన్నారు. కార్యక్రమానికి ఆయా రెవెన్యూ డివిజన్ల నుంచి కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్‌డిఒలు మధుసూదన్, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు హాజరయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి గణేష్‌కుమార్

మెగా డిఎస్‌సికి నోటిఫికేషన్ ఇవ్వాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సికి నోటిఫికేషన్ ఇచ్చి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ స్పందనలో డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతి పక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో ఉరు,వాడ తిరుగుతూ అధికారంలోకి వేస్తే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ఏటా డిఎస్‌సి ఇస్తామని చెప్పారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలలో ఎన్ని ఎన్ని డిఎస్‌సి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. యువత డిఎస్‌సి కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తూ విజయవాడ, హైదారాబాద్ లాంటి ప్రాంతాలలో కోచింగ్ సెంటర్లలో వేలకు వేలు ఫీజులు చెల్లిస్తూ కాలం వెలిబుచ్చుతున్నారు అన్నారు. మరో భాగం వయోభారంతో మానసిక వ్యధను అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంటు సాక్షిగా అఖిల భారత అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కై అడిగిన ప్రశ్నకు 54 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారిక లెక్కలు చెబితే రాష్ట్ర మంత్రులు అవగాహన లేమితో వందలలో ఖాళీలు చూపుతున్నారని వాపోయారు.నిరుద్యోగ యువత ఉద్యోగాల నోటిఫికేషన్ రాదేమో అన్న అభద్రతా భావంతో బలవన్మరనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం టెట్ నిర్వహించి మెగా డిఎస్‌సికి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిరుద్యోగ యువతతో కలిసి ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. నిరుద్యోగుల సెగ పక్క రాష్ట్రంలో ఇప్పటికే గత ప్రభుత్వం అనుభవించి ప్రతిపక్షంలో కూర్చుందని, ఆ విధంగా కాకుండా ఉద్యోగాల భర్తీ కి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు షేక్. షాకీర్,నాయకులు ఓబులేసు పాల్గొన్నారు.

'సంక్షేమ కేలండర్ ప్రకారమే పథకాలు'

ప్రజాశక్తి - కడప

జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల క్యాలండర్‌ను రూపొందించి ప్రజల చెంతకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్‌బి అంజాద్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక నాగరాజుపేటలోని 36వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ రఫీ, అగాడి వీధి వద్ద, 22/2 డివిజన్ పరిధిలో కార్పొరేటర్ ఇన్‌ఛార్జి ఇ. రామచంద్రయ్య ఆధ్వర్యంలో మారుతీ నగర్, మృత్యుంజయ కుంట ల్లో 'ఆంధ్రప్రదేశ్ కి జగనన్నే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇంకా అభివృద్ధి చెందాలంటే, మనందరి కుటుంబాలు బాగుపడాలంటే మళ్ళీ జగన్ ప్రభుత్వం రావాలని అన్నారు కార్యక్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ రఫీ, 22 డివిజన్ కార్పొరేటర్ ఇన్‌ఛార్జి ఇ.రామచంద్రయ్య, కార్పొరేటర్స్ షేక్ మహమ్మద్ షఫీ, అలీ అక్బర్, కమాల్ బాషా, చెన్నయ్య, హరూన్ బాబు, నాయకులు నరపు రెడ్డి సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి,రామకృష్ణ, దానం, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి తిరిగి వచ్చి రాష్ట్రాన్ని గాడిన పెడతారని టిడిపి కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు, సీనియర్ నాయకులు అలంఖాన్ పల్లి లక్ష్మారెడ్డి, నాయకులు దుర్గాప్రసాద్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మన్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని 13వ డివిజన్‌లో ఆఎంపి డాక్టర్ సుబ్బరాయుడు, బోగి రెడ్డి ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గడపగడపకు తిరుగుతూ, ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ ఈ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు సేవలు అవసరమని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మహిళలు బస్సుల్లో ఉచితంగా తిరిగే సౌకర్యాన్ని టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కల్పిస్తుందని తెలిపారు. రైతులకు రూ.20 వేలు అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు యాక్ట్ ఉన్నట్లు, బీసీలకు కూడా యాక్ట్ చచ్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 450 మంది బిసిలు వివిధ రకాలుగా హత్యలకు గురైనట్లు తెలిపారు. మినీ మహానాడులో ఆరు పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. రెండవ విడత మేనిఫెస్టో ప్రకటించే లోపు వైసీపీ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో మా నాయకుడిని జైల్లో పెట్టి తాత్కాలికంగా ఆపగలిగారని తెలిపారు. ప్రజల కోసం జనవరిలో మరిన్ని పథకాలను ప్రకటిస్తారని చెప్పారు. కార్యక్రమంలో కడప జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, కడప నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, కడప నగర ఉపాధ్యక్షులు లింగాల శివ శంకర్ రెడ్డి, నగర నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ కార్యక్రమంలో టిడిపినాయకులు

సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు :ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చెన్నూరు

కమలాపురం నియోజకవర్గంలోని చెన్నూరు మండలం కొండపేట బ్రిడ్జిపై ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసిన నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైసిపి నాయకులకు,అన్ని మండలాల నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. చెన్నూరులో సోమవారం సాయంత్రం ఎంపిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యాత్రకు తరలివచ్చిన ప్రజలను చూస్తే సిఎం జగన్ సుపరిపాలనే జనసమూహానికి కారణమన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో సామాజిక సాధికార యాత్ర ప్రభుత్వం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు హరిప్రసాద్

సిఐపై దాడి హేయం : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో ఒక సిఐపై దాడి చేస్తే నామమాత్రపు కేసులు పెట్టి మయూర హోటల్ యాజమానిని కాపాడటానికి చూస్తున్నారని, అతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని లేకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బి. హరి ప్రసాద్, బలిజ సంఘం నాయకులు దాసరి శివప్రసాద్ హెచ్చరించారు. సోమవారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిఘా సిఐపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పోలీసుల సంఘం స్పందించకపోవడం బాధాకరమని చెప్పారు. వన్ టౌన్ పోలీసులు నామమాత్రపు కేసులు పెట్టడం ఆశ్చర్యం కలిగిస్తుందని పేర్కొన్నారు ఈ కేసును రాజీ చేయడానికి ఒసిఐ ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. ఈ కేసు విషయంపై ఎస్పీ స్పందించకపోవడం దారుణమన్నారు. రాజకీయనాయకుల్లా ప్రెస్ మీట్ లు పెట్టే పోలీసు సంఘం నేతలు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఈ మధ్యకాలంలో ఒక సామజిక వర్గాన్ని టార్గెట్ చేస్తూ దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, రక్షించాల్సిన పోలీసులపైనే దాడులు చేస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా లేదా అని అనుమానం వస్తుందని తెలిపారు. మయూర హోటల్ యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షం లో మయూర గార్డెన్ ఎదుట బలిజ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బలిజ సంఘం నాయకులు నాగరాజు, గంధం ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసులకే రక్షణ కల్పించలేని ప్రభుత్వం

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్రంలో పోలీసుల మీదే దాడి జరిగితే రక్షణే లేదని, ఇక పోలీస్ శాఖ ప్రజలకు ఏమీ రక్షణ కల్పిస్తుందని సమాజంలో ప్రజలు భావిస్తున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ అన్నారు. సోమవారం పాత బస్టాండ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకే కాదు, సాక్షాత్తు స్టేషన్ హౌస్ ఆఫీసర్స్ మీద జిల్లాలో దాడులు జరుగుతుంటే ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యంగా హోమ్ శాఖ మంత్రి, డిజిపి ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. దాడులను తెలుగు దేశం పార్టీ ఖండిస్తోందని చెప్పారు. సమావేశంలో టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, రూపనగుడి హుస్సేన్ పాల్గొన్నారు.

15 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఈనెల 15 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపిడిఒ మహబూబ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మాట్లాడుతూ మొదటగా శంఖవరం ఉన్నత పాఠశాలలో లింగారెడ్డిపల్లి సచివాలయ పరిధిలో ఉన్న క్రీడాకారులందరూ 15న ఆడదాం కార్యక్రమానికి సంసిద్ధం కావాలని ఆమె తెలిపారు. ఆయా పరిధిలో ఉన్న పంచాయతీ సెక్రటరీలు వాలంటీర్ అందరూ సిద్ధంగా ఉండాలని తెలిపారు.

ఉద్యోగాల కల్పన కోసమే జాబ్ మేళాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాల కల్పన కోసమే జాబ్ మేళాలు నిర్వహించినట్టు సీడప్ ప్రతినిధులు పెంచలయ్య, రంగస్వామి, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ సాయి సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు ఉన్నాయని, జాబ్ మేళాను సద్వినియం చేసుకుని తల్లిదండ్రులు ఆశలు నెరవేర్చేలా ప్రతిభ చూపాలని పేర్కొన్నారు. చదువుకుని ఖాళీగా ఉండకుండా జీవితంలో స్థిరపడేలా ఏదో ఒక ఉద్యోగం సాధించాలన్నారు. ఉద్యోగాల్లో స్థిరపడి తమ కుటుంబాలను బాగు చేసుకోవాలని జాబ్ మేళా వచ్చిన యువతకు సూచించారు. ఏ చిన్న అవకాశమూ వదులుకోవద్దని, మీ భవిష్యత్తు మీ చేతుల్లో ఉందన్నారు. చిన్న ఉద్యోగం, చిరుజీతం అని కాకుండా ముందు ఉద్యోగంలో చేరి అంచెలంచలుగా ఎదగాలని ఆకాంక్షించారు. జాబ్ మేళా లో సుమారు 22 కంపెనీలు పాల్గొన్నాయని పేర్కొన్నారు. 276 మంది యువత పాల్గొన్నారు అని తెలిపారు.

జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

జూనియర్ లాయర్లకు ఆర్థిక చేయూత : జెసి

ప్రజాశక్తి - కడప

కొత్తగా న్యాయవాద వృత్తిని చేపట్టిన జూనియర్ లాయర్లకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'వైఎస్‌ఆర్ లా నేస్తం' పథకం ఆర్థిక చేయుతతో పాటు వృత్తిలో కొనసాగేందుకు మరింత ప్రోత్సాహన్నిస్తోందని జెసి జి.గణేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2023-24 సంవత్సరానికి సంబంధించి రెండవ విడతగా 6 నెలల (జులై-డిసెంబర్ వరకు) 'లా నేస్తం' నిధులను బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జెసి, గవర్నమెంట్ ప్లీడర్ శివశంకర్ రెడ్డి, జూనియర్ అడ్వకేట్స్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం జెసి మాట్లాడుతూ లా డిగ్రీ తీసుకున్న తర్వాత తొలి మూడేళ్లు న్యాయవాదిగా స్థిరపడేందుకు 'లా నేస్తం' కింద ఇచ్చే స్టైఫండ్ లాయర్లకు ఎంతో ఆర్థిక భరోసాను ఇస్తుందన్నారు. జూనియర్ లాయర్లకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ గొప్ప పథకాన్ని న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. (పథకం ద్వారా 2023-24 సంవత్సరంలో (జూలై-డిసెంబర్ వరకు) 6 నెలలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 159 మందికి వైఎస్ఆర్ లా నేస్తం ద్వారా రూ.47,70,000 మంజూరైందన్నారు.

స్వచ్ఛంద సేవకులకు స్ఫూర్తి పురస్కారాలు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

పేదలు, అనాథ మృతదేహాలకు సంప్రదాయ పద్ధతిలో అంతమ సంస్కారాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులకు వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ఫూర్తి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామిరెడ్డి మాట్లాడుతూ మనిషి బతికి ఉన్నంతవరకు అందరూ ఆదరిస్తారు, అభిమానిస్తారు. ప్రాణం ఎప్పుడైతే పోతుందో మరుక్షణమే శ్మశానానికి తరలిస్తారని పేర్కొన్నారు. అభాగ్యుల మృతదేహాలకు శాస్త్రయుక్తంగా, సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గణిత ఉపాధ్యాయుడు లింగందిన్నె చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తన శిష్యుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి నిర్వహిస్తున్న వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొనడం తనకు సంతోషాన్ని కలిగిస్తోంది అన్నారు. సంస్థ గౌరవ సలహాదారుడు రాజోలి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'నేను అన్న భావన ఎప్పుడైతే పోతుందో అప్పుడు 'సేవాభావం' అలవరుతుంది అన్నారు. వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షులు పాపిజెన్ని రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ యోగిలా, యోధుడిలాగా మారాలని ఆకాంక్షించారు. తాను చదువుకున్న కళాశాలలో కొందరినైనా సమాజసేవ వైపు అడుగులు వేయించాలని భావించి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత సంస్థ అధ్వర్యంలో అంత్యక్రియలు చేయడానికి సహకరించిన 19 మందిని శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. యువతకు సమాజసేవ గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ అసోసియేషన్ అధ్యక్షులు గురుమూర్తి, చెముడూరి వీరాస్వామి, అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు ముత్తుముల రామతులసి, శ్రీనివాస రెడ్డి, శ్రావణి, ప్రసన్న, సురేష్ పాల్గొన్నారు.

సేవకులను సన్మానించిన ప్రముఖులు

తెలంగాణ సిఎంను సన్మానించిన శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాస రెడ్డి. సోమవారం హైదరాబాద్ లో మిత్రుడు, తెలంగాణ సిఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా వేసి శుభాకాంక్షలు తెలిపారు.

రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి

జెసికి కార్మికుల సమస్యలు వివరిస్తున్న మనోహర్

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న 6 నెలల వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ స్పందనలో జెసికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో క్లాప్ డ్రైవర్లకు వేతనాలు ఇవ్వాలనే ఆలోచన కమిషనర్ చేయకపోవడం బాధాకరమన్నారు. కార్మికులు వేతనం అడిగిన కమిషనర్ పట్టించుకోవడంలేదని తెలిపారు. అప్పులు, సొప్పులు తెచ్చుకుని కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తూ 6 నెలలుగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కమిషనర్ కానీ, రెడ్డి ఏజెన్సీ గాని వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమని చెప్పారు. వెంటనే క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. సమస్యపై స్పందించిన జెసి గణేష్ కుమార్ ప్రొద్దుటూరు కమిషనర్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'నాసిరకంగా నగర అభివృద్ధి పనులు'

ప్రజాశక్తి - కడప

కడప నగరంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు నాణ్యత లేకుండా జరుగుతున్నాయని, ఇదంతా ఈనెల 25న ముఖ్యమంత్రితో ప్రారంభించేందుకు అధికారులు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు, ప్రీతం రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన , కాంగ్రెస్ నాయకులు కృష్ణ థియేటర్ వద్ద జరుగుతున్న సర్కిల్ పనులను పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 351 ప్రకారము కడపలో అంబేద్కర్ సర్కిల్ నుంచి వై. జంక్షన్ వరకు రూ.61.96 కోట్లు, కృష్ణా సర్కిల్ నుంచి దేవుని కడప వరకు రూ.100.51 కోట్లు మాసాపేట సర్కిల్ నుంచి పాత బైపాస్ (బళ్ళారి రోడ్డు) వరకు రూ.69.20 కోట్లు, అన్నమయ్య సర్కిల్ నుంచి గోకుల్ సర్కిల్ వరకు రూ.73.84 కోట్లు మంజూరు చేశారన్నారు. పనులు చాలా వేగంగా, నాసిరకంగా సిమెంటులో ఇసుక ఎక్కువ కలుపుతూ, వాటర్ క్యూరింగ్ సరిగా చేయకుండా చేస్తున్నారని చెప్పారు. వాటర్ క్యూరింగ్ కు తగినన్ని రోజులు కేటాయిస్తూ ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు వరం కాకుండా నాణ్యతగా చేపట్టాలని కోరారు. నగరంలో శనివారం రాత్రి ఇంటిలిజెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనీల్ పై దాడి నగరంలోని ప్రజలను భయభ్రాంతులను చేసింది అన్నారు. ఒక ఉన్నతమైన పోలీస్ అధికారికే రక్షణ లేనప్పుడు సామాన్యానికి ఎలా రక్షణ వస్తుందని ప్రజలు భయపడుతున్నారని అన్నారు. జిల్లా పోలీసు అధికారులు ఈ చర్య పై తీవ్రంగా స్పందించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు శాంతిభద్రతలపై నమ్మకం కలిగించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి, రాష్ట్ర లేబర్ సెల్ అధ్యక్షులు పుల్లయ్య , రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు పటాన్ మహమ్మద్ అలీ ఖాన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఖాదర్ ఖాన్, ఎన్ఎస్‌యుఐ. జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, ఓబీసీ జిల్లా అధ్యక్షులు చిన్న కుల్లాయప్ప, మాజీ కార్పొరేటర్ రంతుల్లా ఖాన్, సమాచార హక్కు చట్టం జిల్లా ఉపాధ్యక్షులు షామీర్, ఆనంద్ పాల్గొన్నారు.

నగరంలో చేపడుతున్నపనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మి

సనాతన దురాచారాలను అరికట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆధునిక ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సనాతన దురాచారాలైన లింగ వివక్షత, వరకట్నం ఆచారం, స్త్రీ శిశు హత్య వంటి వాటిని ఆరికట్టేందుకు విద్యార్థులు ప్రజలను చైతన్యవంతులను చేయాలని ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు, సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మి కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లింగ వివక్షతపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళల పట్ల నేటికి అనేక రంగాల్లో వివక్షత చూపిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాలకొండ గంగాధర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్సెస్ అధికారి మాధవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసులకే రక్షణ కరువు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి పాలనలో పోలీసులకే రక్షణ కరువైందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రౌడీల స్వైర్యవిహారం వల్ల ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేదన్నారు. అఫ్ఘానిస్థాన్‌లోని తాలిబన్ల పాలనను మించిపోయినట్లు తులసిరెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులకే వైసిపి రౌడీల నుండి రక్షణ కరువైందన్నారు. ఇటీవల కమలాపురం నియోజకవర్గంలోని చింతకొమ్మదిన్నె ఎఎస్ఐపై వైసిపికి చెందిన గ్రావెల్ ఆక్రమణదారులు దాడులు చేశారన్నారు. ప్రొద్దుటూరులో ఎస్ఐ హైమావతిపై ఇసుకాసురులు దాడి చేయగా సెల్‌ఫోన్ పగిలి పోయి, కాలికి గాయమైందన్నారు. కడప నగరంలో ఆదివారం రాత్రి సిఐ అనిల్‌కుమార్‌పై దాడి చేసినట్లు తెలిపారు. వైసిపి నిర్వహిస్తున్న సామాజిక న్యాయం బస్సు యాత్ర పట్ల ప్రజల్లో ఏ మాత్రం స్పందన లేదన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసిపి ఓడిపోవడం ఖాయమన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న అఖిలపక్ష కమిటీ సభ్యులు

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు వద్దనున్న కూడలిలో బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని అఖిలపక్ష కమిటీ కోరింది. ఆ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు వద్ద దాదాపు 20ఏళ్ల నుంచి అంబేద్కర్ నగర్ ఉందన్నారు. చుట్టూ ఉన్న ప్రకాష్ నగర్, ఇందిరా నగర్‌లో కూడా దళితులు, అట్టడుగు వర్గాల వారే నివసిస్తున్నారని అన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించి, ప్రజలు తమ హక్కులను పొందేలా చేసిన మహనీయులు డాక్టర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. బైపాస్ రోడ్డు వద్దనున్న కూడలిని కూడా అంబేద్కర్ సర్కిల్‌గా నామకరణం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బయన్న, అన్వేష్, టిడిపి నాయకులు బాషా, నాగేశ్వరరావు, సేట్, సంజీవరెడ్డి, సిపిఐ నాయకులు రాధాకృష్ణ, భాస్కర్, జిలాని, సునీల్, సుభాష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొత్త కాంప్లెక్స్‌కు 'గాడిచర్ల' పేరు పెట్టాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణ పాత సంత మార్కెట్ స్థలాన్ని పూర్వం గాడిచర్ల వంశీయులు మార్కెట్ నిమిత్తం అప్పటి పులివెందుల పంచాయితీకి వితరణ చేశారని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ టిడిపి నాయకులు తూగుట్ల మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గాడించర్ల నాగరాజు రావు రిటైర్డ్ మార్కెట్ యార్డ్ సెక్రటరీతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో ఆయన కమిషనర్ వివి నరసింహారెడ్డికి వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త కాంప్లెక్స్‌కు గాడిచర్ల పేరు పెడితే చరిత్రలో చిరుస్థాయిగా ఉంటుందన్నారు. పులివెందుల ప్రజల ఆకాంక్ష మేరకు వినతిపత్రం ఇచ్చామన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న మధు

కాంబోజి రామలక్షుమ్మ నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



రామలక్ష్మమ్మ (ఫైల్‌ఫోటో)

స్థానిక కడప రోడ్డులో ఉన్న కాంబోజి రామలక్షుమ్మ (72) నేత్రదానానికి ఆమె కుమారులు అంగీకరించారు. సోమవారం ఆమె మరణించడంతో కుమారులు గంగిశెట్టి, వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, కోడళ్ళు లక్ష్మీదేవి, శ్రీలక్ష్మి, కుమార్తె గంగాభవాని, అల్లుడు సుబ్రహ్మణ్యం నేత్రదానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారమిచ్చారు. ఆ మేరకు రామలక్షుమ్మ మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులను సేవా సమితి బృందం అభినందించింది.

నేడు డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు ఆర్‌టిసి డిపో కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పి.వి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు తమ సూచనలు 99592 25778 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు.

నేడు, రేపు నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

నీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా మంగళ, బుధవారాల్లో నీటి సరఫరా బంద్ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు రోడ్డులోని ధర్మాపురం వద్ద పైప్‌లైన్ లీకేజీ కారణంగా మరమ్మత్తుల నిమిత్తం నీటి పంపింగ్ సరఫరా నిలిపివేయడం అనివార్యమైందన్నారు. పట్టణంలోని ఆర్ట్స్ కాలేజి రోడ్డు, గోపిరైస్‌మిల్ రోడ్డు, దొరసానిపల్లి రోడ్డు, భావనారుషి దేవాలయం, వినాయకనగర్, పవర్‌హౌస్ రోడ్డు, వరలక్ష్మి అపార్ట్‌మెంట్, రామేశ్వరం, వసంతపేట, బంగారయ్య కొట్టాలు, హనుమాన్‌నగర్, శ్రీరామ్‌నగర్, సుందరాచార్యుల వీధి, మౌలానా ఆజాద్‌వీధి-1,2,3,4, కొంపలపుల్లన్న వీధి ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

చికెన్ ధరలను నియంత్రించాలి

కమిషనర్‌తో చర్చిస్తున్న అఖిలపక్ష కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో చికెన్ ధరల నియంత్రణపై అఖిలపక్ష కమిటీ సభ్యులు సోమవారం మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్‌తో చర్చించారు. పట్టణంలో చికెన్ ధరలు రోజురోజుకూ ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. సామాన్య ప్రజలు అధిక ధరల కారణంగా చికెన్ తినే పరిస్థితుల్లో లేరని వాపోయారు. పరిసర ప్రాంతమైన ప్రొద్దుటూరుతో పోలిస్తే ఎర్రగుంట్లలో చికెన్ ధర కిలోపై రూ.30 రూ.40 రూపాయలు ఎక్కువగా ఉందన్నారు. లైవ్ మార్కెట్ రేట్ నిబంధనల ప్రకారం అమ్మవలసి ఉండగా.. దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘిస్తూ అధిక ధరలకు అమ్ముతున్నారని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి నిబంధనలకు మించి ఎక్కువ ధరలకు విక్రయించే దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ అధిక ధరల విషయమై దుకాణదారులను ప్రశ్నించగా ప్రొద్దుటూరుకు లోకల్ మార్కెట్ నుండి కోళ్ళు సరఫరా అవుతున్నాయని, ఎర్రగుంట్లకు బయట ప్రాంతాల నుండి వస్తుండడంతో రవాణా ఖర్చు కావడంతో కొద్దిపాటి అధిక రేట్లు పెట్టినట్లు తెలిపారని అన్నారు. అఖిలపక్ష కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రొద్దుటూరు, ఎర్రగుంట్లకు కోళ్ళ సరఫరా చేయు డీలర్ ఒకరే అని తెలిపారు. డీలర్ ఒకరే అయినప్పుడు ధరల్లో ఎందుకు వ్యత్యాసం ఉంటుందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా చికెన్ ధరలు నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష కమిటీ సభ్యులు కమిషనర్ జగన్నాథ్‌ను కోరారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

కార్తీక మాస నాలుగో సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పిడబ్ల్యుడి బంగ్లా సమీపంలోని శివభక్తేంద్రాలయం, పుల్లూరు సమీపంలోని శ్రీ నాగ నాధేశ్వర ఆలయం భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజామున శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నాగ నాధేశ్వర కోనలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బండలాగుడు పోటీలను మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు ఆలయ నిర్వాహకులు, నాయకులు బహుమతులను అందజేశారు. ఆలయ చైర్మన్ గుమ్మ శ్రీరెడ్డి, ఏపీఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, అగ్రహార సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీ కాశినాయన ఆశ్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేశారు. భజన, చెక్కభజన వంటి కార్యక్రమాలు అలరించాయి.

బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

సచివాలయ వ్యవస్థతో సమూల మార్పులు

హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టడంతో సమూల మార్పులు వచ్చాయని పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లోమడ, అంకాలమ్మ గూడూరు, బలప నూరులలో నూతనంగా నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలను సోమవారం ఎంపీ, పాడా ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సచివాలయంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ఎవరి సిఫార్సు లేకుండానే అర్హతగల వారికి పథకాలను అందుతున్నాయన్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం సీఎం జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఝాన్సీరాణి, ఎంపీపీ అరుణ, ఉప మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో కృష్ణమూర్తి వైద్యాధికారి షేక్ హుస్సేన్ పీరా, తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎస్ఐ రోషన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అర్హులకు లబ్ధి



డిజిటల్ బోర్డు ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి, అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని మడూరు గ్రామంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.16.07 కోట్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ద్వారా లబ్ధి చేకూరిందని ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. గ్రామంలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సచివాలయంలో నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన మంచిని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, మండల నాయకులు వినయ్ కుమార్‌రెడ్డి, గ్రామ నాయకులు నరసింహారెడ్డి, సుబ్బయ్య, సర్పంచ్ వెంకట సుబ్బయ్య, ఎంపిటిసి సీమోన్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వేంపల్లె : రాష్ట్ర ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలోని 6వ గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న మళ్లీ సిఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వేంపల్లి 6 సచివాలయ పరిధిలో రూ.18.08 కోట్లు నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మల్లికార్జునరెడ్డి, జిల్లా యువజన కార్యదర్శి కసిరెడ్డి ఆదిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు సునీల్, నాగేష్, సచివాలయ కో-ఆర్డినేటర్ సుదర్శన్ రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ జయరాములు, లక్ష్మినారాయణ, సాయి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చంద్రఓబుల్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సి.నారాయణరెడ్డి

పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొండాపురం

గండికోట ప్రాజెక్టు పునరావాస కాలనీలలో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి బుధవారం చేస్తున్న పాదయాత్రను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ సి.నారాయణ రెడ్డి కోరారు. పాదయాత్ర బుధవారం ఉదయం ఏడు గంటలకు ఎర్రగుడి గ్రామంలో ప్రారంభమై చామలూరు, సంకేపల్లి, సుగుమంచిపల్లి, దత్తాపురం, తాళ్ల ప్రొద్దుటూరు, వెంకటాపురం గ్రామాల మీదుగా కొండాపురం చేరుతుందన్నారు. సాయంత్రం కొండాపురంలో బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. తన కుమారుడు చేస్తున్న పాదయాత్రకు భారీ సంఖ్యలో ముంపు వాసులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

అంధుల వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణం కచేరీ రోడ్డులో ఉన్న శ్రీ వీర అంధుల ఆశ్రమంలో సోమవారం స్థానిక మంజులప్రమీల మొదటి వర్ధంతి సందర్భంగా ఆమె భర్త కుళ్లాయప్ప, కుమారులు నాగమునీంద్ర, కులశేఖర కుటుంబ సభులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు అనిమేల రామమోహన్ పాల్గొన్నారు

ఘనంగా కార్తీక సోమవారం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక నాల్లవ సోమవారం సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాటం భక్తులను అలరించింది. వివిధ ప్రాంతాల మహిళా కళాకారులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో అల్లాడుపల్లెకు చేరుకున్నారు. ఇఒ శ్రీనివాసులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ జిసి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య, సర్వజన కల్యాణ మండపంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మైదుకూరులో.. మైదుకూరు మున్సిపాటిటీ పరిధిలోని చిన్నయ్యగారిపల్లె వద్ద ఉన్న ముకుంద మల్లేశ్వరస్వామికి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఏర్పాట్లు చేశారు. కొండ దిగువ ప్రాంతంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొండాపురం : మండలంలోని కోనలు, శివాలయాలు కార్తీక చివరి సోమవారం శివనామస్మరణతో మార్మోగాయి. మండలంలోని అతి ప్రాచీన మహిమాన్విత శైవక్షేత్రలైన బాల మల్లేశ్వర స్వామి కోన, నీల మల్లేశ్వరస్వామి కోనలలో భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. బాల మల్లేశ్వర స్వామి కోనలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం కమిటీ చర్యలు చేపట్టింది. అధ్యక్షుడు మిట్ట భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మిట్ట వంశీయులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నీలమల్లేశ్వర స్వామికోనలో దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు.

సింహాద్రిపురం : మండల పరిధిలోని గురజాల సమీ పంలో వెలసిన శ్రీ గురుకుంట ఆలయ సముదాయ తిరుణాల మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా ముగిసింది. శ్రీ అభయాంజనేయుడు, శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. భక్తులకు జువారి సిమెంట్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్యాకెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సింహాద్రిపురం మహిళా బృందం కోలాటం ఆకట్టుకుంది.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, KADAPA

E.P.No. 69/2022

O.S.No. 72/2012

Kavali Radha Krishnaiah.

...Petitioner/D.Hr

Vs

Ambati Subbarai.

...Respondent/J.Dr.

NOTICE TO THE J.Dr.

Please take notice that the Hon'ble Court has ordered for notice to the JDr. to appear on 21-12-2023 at 10.30 A.M.in the above Court either personally or through Advocate failing which the matter will be decided exparte.

//By Order of the Hon'ble Court//

Y.SRINIVASULU

Advocate for Plaintiff,

KADAPA.

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాస్

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఎస్ఎఫ్ఐ (భారత విద్యార్థి ఫెడరేషన్)ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈనెల 30న ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రయివేట్ జూనియర్ కళాశాల విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడుఎ.వినయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం క్రికెట్ టోర్నమెంట్‌ను ముఖ్య అతిథిగా సిపిఎం నూతన పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమన్నారు. మానసిక ఆనందరం, శరీర దృఢ త్వం కలుగుతుందన్నారు. సంఘం ఎస్ఎఫ్ఐ విద్యార్థుల కోసం ఇలా క్రీడా పోటీ లను నిర్వహించడం అభినందనీయమన్నారు. గెలుపోటములు సహజమన్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్ హుస్సేన్, మియా, చింటూ, ఇర్షాద్, నరేంద్ర పాల్గొన్నారు.

కార్యదర్శులకు క్రీడా కిట్లను అందిస్తున్న జడ్‌పిటిసి బాలయ్య

ఎలాంటి అసౌకర్యం కలిగించొద్దు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి సోమవారం కిట్లను పంపిణీ చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జడ్పిటిసి తమ్మిశెట్టి బాలయ్య సచివాలయ కార్యదర్శులకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించిన కిట్లను అందించారు. మొత్తం 14 సచివాలయులకుగానూ 3500 మంది ఆటలు ఆడుటకు పేర్లు నమోదు చేసుకున్నారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని జడ్పిటిసి బాలయ్య సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భాగ్యలక్ష్మి, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

దాతలకు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఎసి

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి అనంతపురం నగరం సాయినగర్ మూడవ క్రాస్ వాస్తవ్యులు పద్మ వెంకటరమణ జ్ఞాపకార్థం వారి భార్య వెంకట సుబ్బమ్మ, కుమారులు వెంకట శివరామ ప్రసాద్, రాజేష్‌కుమార్ రూ.1,00,116 విరాళం అందజేశారు. వీరికి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ, ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేష వస్త్రంతో వేద ఆశీర్వచనం చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు.

నేడు నాయీ బ్రాహ్మణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి - ముద్దనూరు

తిరుపతి ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న ఉదయ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు గుర్రప్ప తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు, టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య పాల్గొంటారన్నారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి కోసం చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులు పాల్గొని సమావేశం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

Union Bank of India (A Government of India Undertaking)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రీజినల్ ఆఫీసు: 21/58, బిఎస్ఎన్ఎల్ కాంపౌండు వద్ద అనెక్ష్ బిల్డింగ్, హెడ్ పోస్టు ఆఫీసు ప్రక్కన, ట్రంక్ రోడ్, కడప-516001, ఎ.పి.
బ్రాంచి ఇ-మెయిల్-..........; సంప్రదించాల్సిన నం.: 08569-286055

స్వాధీనత ప్రకటన
(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1)- స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సోమిరెడ్డిపల్లి బ్రాంచి (28611), కడప యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, **తేది: 29.09.2023** నాటి డిమాండ్ నోటీసు జారీచేసి, **రుణగ్రహీత: (1) శ్రీ మాకం గురువయ్య** తండ్రి శ్రీ పెద్ద వెంకటయ్య నివాసం: స్వామినివాస గృహ, డోర్ నం.8/522-2, బి. మఠం, కందిమల్లయ్య పల్లి, కడప-516503 **మరియు సహ-బాధ్యులు (2) శ్రీ అరవేటి వెంకట సుబ్బా రాయుడు** తండ్రి శ్రీ సుబ్బయ్య అరవేటి, నివాసం: ఇ.నం.7-320,బి. మఠం, కందిమల్లయ్య పల్లి, కడప-516503 అనువారిని, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు **రూ.4,07,778.72 పై.లు (రూపాయలు నాలుగు లక్షల ఏడు వేల ఏడు వందల డెబ్బై ఎనిమిది మరియు డెబ్బై రెండు పైసలు మాత్రమే)**లను **మరియు దానిపై వడ్డీ& ఖర్చులతో** తిరిగి చెల్లించవలసిందింగా కోరబడినది.

రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని క్రింది సంతకందారు **06.12.2023న స్వాధీనంచేసుకున్నారు.**

ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సోమిరెడ్డిపల్లి శాఖకు చెల్లింపులుచేయుటకులోబడి ఉంటుంది. బకాయిలకు ఏవేని మొత్తాలు చెల్లించినట్లైతే, ఖాతాలో ఫైనల్ పేమెంట్ సమయంలో సర్దుబాటుచేయబడుతుంది.

సెక్యూర్డ్ అసెట్స్ విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

సెక్యూర్డ్ అసెట్ వివరణ:

స్వామి నివాసం గృహ స్ట్రీట్, యాదవ సత్రం, సోమిరెడ్డిపల్లి పంచాయతి, బి. మఠం మండలం, కడప వద్ద సర్వే నం.337/2, డోర్ నం.8/522-2 లోగల 1.19సెంట్ల విస్తీర్ణంతో ఎం. గురువయ్య పేరున ఉన్న భవనముతో నివాసిత సైటు మరియు సరిహద్దులు: తూర్పు: ఎం. వాణి ఇల్లు, పడమర: బాట, ఉత్తరం: బాట, దక్షిణం: బాట.

తేది: 06.12.2023 **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం : కడప. **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరఫున**